## బడ్జెట్‌లో పోటాపోటీ




**ఇంటింటికీ** పరిచయమైన ఓటీటీ.. సినీ ఇండస్ట్రీకి కొత్త సవాలు విసురుతున్నది. ఎంత గొప్ప సినిమా అయినా.. నెల రోజుల్లో ఓటీటీలో ప్రత్యక్షమవుతున్నది. దీంతో ప్రేక్షకులను థియేటర్లకు రప్పించడం దర్శక, నిర్మాతలకు కత్తి మీద సాములా తయారైంది. ఈ సినిమా థియేటర్‌లో చూస్తేనే కిక్కు వస్తుంది అనుకునేలా చిత్రాలను నిర్మిస్తున్నారు. యాక్షన్ సీక్వెన్స్, విజువల్ ఎఫెక్ట్స్ కోసం కోట్లు ఖర్చు చేస్తున్నారు. నిర్మాణంలో ఉన్న 'సింగమ్ అగైన్' సినిమాలో ఒకే యాక్షన్ ఎపిసోడ్ కోసం ఏకంగా రూ.25 కోట్లు వెచ్చించారట నిర్మాతలు. అజయ్ దేవ్‌గణ్, అక్షయ్ కుమార్, రణ్‌వీర్‌సింగ్, టైగర్ ష్రాఫ్, విక్కీ కౌశల్, దీపికా పదుకొణె ఇలా భారీ తారాగణం ఇందులో నటిస్తున్నది. ఈ సినిమా బడ్జెట్ రూ.250 కోట్లు దాటేలా ఉందని ఇండస్ట్రీ టాక్! ప్రతి సన్నివేశాన్నీ ప్రేక్షకులు మెచ్చేలా చిత్రిక పట్టాలన్న లక్ష్యంతో రాజీ పడకుండా ఖర్చు చేస్తున్నారట. అక్షయ్ కుమార్, సంజయ్ దత్, సునీల్ శెట్టి తదితరులు నటిస్తున్న సినిమా 'వెల్‌కం టు జంగిల్'. ఈ సినిమా నిర్మాణ వ్యయం నటీనటుల రెమ్యునరేషన్ కాకుండా రూ.100 కోట్లు దాటుతున్నదట. దాదాపు పాతికేళ్ల తర్వాత నిర్మాత కరణ్ జోహార్, సల్మాన్ ఖాన్ జోడీ కడుతున్న చిత్రం 'బుల్'. 'షేర్షా' ఫేమ్ విష్ణువర్ధన్ దీనికి దర్శకుడు. ఇందులో సల్మాన్ ఆర్మీ బ్రిగేడియర్‌గా నటిస్తున్నారు. యుద్ధ సన్నివేశాలను ఆసక్తికరంగా తీర్చిదిద్దడానికి భారీ ఎత్తున ప్లాన్ చేస్తున్నారట. రూ.150 కోట్ల బడ్జెట్‌తో దీన్ని తెరకెక్కిస్తున్నట్టు తెలుస్తున్నది. మొత్తంగా ఓటీటీకి ఓటేస్తున్న ప్రేక్షకులను థియేటర్లకు రప్పించడానికి ఆరాటపడుతున్న సినీజనం.. బడ్జెట్ విషయంలో కాంప్రమైజ్ కావొద్దని ఫిక్సయినట్టున్నారు!

# నమస్తే తెలంగాణ జిందగీ




## నచ్చేలా ట్రెండీ

### సింగపూర్ సెలూన్ (తమిళం)

**అమెజాన్ ప్రైమ్:** ఫిబ్రవరి 23
**నటీనటులు:** ఆర్జే బాలాజీ, సత్యరాజ్, లాల్, మీనాక్షి చౌదరి
**దర్శకత్వం:** గోకుల్

నయనతార ప్రధాన పాత్రలో వచ్చిన 'అమ్మోరు తల్లి' సినిమాతో ఆర్జే బాలాజీ తెలుగులో ఓటీటీ ప్రేక్షకులకు దగ్గరయ్యాడు. ఆ చిత్రంలో అతని కామెడీ టైమింగ్‌కు చాలా మంది అభిమానులు అయ్యారు. తాజాగా బాలాజీ నటించిన 'సింగపూర్ సెలూన్' చిత్రం తమిళ వెర్షన్‌ను కూడా తెలుగు ప్రేక్షకులు చూస్తున్నారంటే.. ఓటీటీలో అతనికి ఉన్న క్రేజ్ ఏంటో అర్థం చేసుకోవచ్చు. కథలోకి వెళ్తే.. కదిర్ (ఆర్జే బాలాజీ) తెన్‌కాశీలో ఉంటుంటాడు. చిన్నప్పటి నుంచి 'సింగపూర్ సెలూన్' నిర్వాహకుడు చాచా (లాల్) అంటే అతనికి ప్రాణం. ఆయన స్ఫూర్తితోనే పెద్దయ్యాక మంచి హెయిర్ స్టయిలిస్ట్ కావాలనుకుంటాడు. పట్నంలో ఇంటర్ పూర్తిచేసి ఊరికి వచ్చేసరికి చాచా సెలూన్ మూతబడుతుంది. అతను ఏమయ్యాడో తెలియదు. ఈ పరిస్థితుల్లో ఇంజినీరింగ్‌లో సీటు వచ్చినా కాదనుకొని కటింగ్ షాపు పెడతానంటాడు. తండ్రి నచ్చజెప్పడంతో పంతం మాని ఇంజినీరింగ్‌లో చేరుతాడు. చదువు పూర్తయ్యాక 'సింగపూర్ సెలూన్' పేరుతో కార్పొరేట్ స్థాయిలో షాపు పెట్టాలనుకుంటాడు. ఈ క్రమంలో తన మామయ్య (సత్యరాజ్) దగ్గర అప్పు తీసుకుని చెన్నైలో ఓ భారీ మాల్‌లో దుకాణం తీసుకుంటాడు. అయితే, అనుకోని కారణాల వల్ల సెలూన్ తెరవలేకపోతాడు. తన లక్ష్యం నెరవేరే దారి లేకపోవడంతో ఆత్మహత్య చేసుకోవాలనుకుంటాడు. ఇంతకీ కదిర్ ఆత్మహత్య ప్రయత్నం విరమించుకున్నాడా? అకస్మాత్తుగా కనిపించకుండా పోయిన చాచా ఏమయ్యాడు? కదిర్ లక్ష్యం నెరవేరిందా, లేదా అన్నది మిగిలిన కథ!




# బిజినెస్ నాయికలు

### వృత్తి సంపద కోసం..
### ప్రవృత్తి సంతృప్తి కోసం..

**నటనను వృత్తిగా ఎంచుకున్నవాళ్లకు అందులోనే సంతృప్తి! అంతకుమించి సాధించాలన్న తపన కొందరిని ఊరికే ఉండనివ్వదు. అందుకే సినీతారలు వ్యాపారవేత్తలుగా అవతారం ఎత్తుతున్నారు. ఆర్థిక భద్రత కోసం కొందరు, తమ సృజనాత్మకతను ఆవిష్కరించడానికి ఇంకొందరు.. కారణం ఏదైతేనేం.. ఆంత్రప్రెన్యూర్లుగా సెటిలవుతున్నారు పలువురు కథానాయికలు.**

**సెలెబ్రిటీలు,** వారి కుటుంబాల వ్యక్తిగత విశేషాల గురించిన వార్తలకు ఉండే ఆదరణే వేరు. వెండితెరపై అందం, అభినయం ప్రదర్శించడం ద్వారా అభిమాన'ధనాన్ని' సంపాదించుకున్న నటీమణులెందరో! అలా కూడబెట్టిన సొమ్ము రెట్టింపు చేసుకునేందుకో, ఆర్థిక భద్రత కోసమో వ్యాపార రంగంలోకి అడుగుపెట్టిన సినీ తారలు, వారి కుటుంబసభ్యులు చాలామందే ఉన్నారు. టాలీవుడ్‌లో టాప్ హీరోయిన్లుగా రాణిస్తూనే బిజినెస్‌లోనూ అడుగుపెట్టి.. రెండు చేతులా సంపాదిస్తున్నారు. సినీ పరిశ్రమను 'చిరు'నామాగా మలుచుకున్న మెగాస్టార్ ఫ్యామిలీ లేడీస్ సైతం తాజాగా ఓ వ్యాపారాన్ని ప్రారంభించారు. ఈ విషయాన్ని కొణిదెలవారి కోడలు, రాంచరణ్ భార్య ఉపాసన సామాజిక మాధ్యమాల వేదికగా ప్రకటించారు.

### నువ్వేం మాయ చేస్తావో.. భూమిక

**'ప్రేమకథ'** చిత్రంతో పరిచయమై 'ఒక్కడి'తో 'నువ్వేం మాయ చేశావో..' అనిపించుకున్న నటి భూమిక. కథానాయికగా సక్సెస్ అయిన ఈ నటి సెకండ్ ఇన్నింగ్స్‌లోనూ సత్తా చాటుతున్నది. అడపాదడపా సినిమాల్లో కనిపిస్తూనే... వ్యాపారవేత్తగా తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నది. గత జనవరిలో రెస్టారెంట్ బిజినెస్‌లోకి ప్రవేశించింది. మన దేశంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం గోవాలో వెల్‌నెస్ హోటల్‌ను ప్రారంభించింది. సోషల్ మీడియా వేదికగా ఈ విషయాన్ని పంచుకుంది. 'గోవాలో మా సరికొత్త వెంచర్ 'సమర వెల్‌నెస్ హోటల్''.. అని ఇన్‌స్టాలో రాసుకొచ్చింది. క్రీడాకారులు, వివిధ రంగాలకు చెందిన సెలెబ్రిటీలు చాలామంది రెస్టారెంట్ బిజినెస్‌లో అడుగుపెట్టారు. వీరందరికీ భిన్నంగా భూమిక వెల్‌నెస్ హోటల్‌ను ప్రారంభించింది. స్పాతోపాటు మ్యూజిక్, డ్యాన్స్ హబ్‌గా దీన్ని తీర్చిదిద్దింది. గోవాకు వెళ్లినప్పుడు ఈ కథానాయిక వెల్‌నెస్ సెంటర్‌ను మీరూ సందర్శించండి!



### ఫ్యాషన్ లేబుల్.. సమంత

**అందానికి** మించిన అభినయంతో స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది సమంత. కొత్తదనానికి కేరాఫ్‌గా ఉండే ఆమె ఎక్కడికి వెళ్లినా అందరి కండ్లూ ఆమె ధరించిన ఆభరణాలపైనే ఉంటాయి. సమంత ఫ్యాషన్ టేస్ట్ అలా ఉంటుంది మరి! అందుకే, సొంతంగా 'సాకీ' పేరుతో ఓ ఫ్యాషన్ లేబుల్‌ను ప్రారంభించింది. ఇందులో మోడ్రన్ ఇండియన్ బ్రాండెడ్ కలెక్షన్లు అందుబాటులో ఉంటాయి. దీంతోపాటు 'ఏకమ్ ఎర్లీ లెర్నింగ్ సెంటర్' పేరుతో కొన్ని విద్యాసంస్థలూ నిర్వహిస్తున్నదీ స్టార్ బిజినెస్ ఉమెన్. కొన్నాళ్ల కిందట 'ట్రలాలా మూవింగ్ పిక్చర్స్' పేరుతో సినీ నిర్మాణ సంస్థను సైతం స్థాపించింది.

### స్కిన్ కేర్ బ్రాండ్... కీర్తి సురేశ్

**మహానటి** సావిత్రి జీవిత గాథతో తెరకెక్కిన సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన ఈ తరం సహజ నటి కీర్తి సురేశ్. సినిమాల్లో బిజీగా ఉంటూనే వ్యాపారిగా అవతారమెత్తింది. ఓ స్కిన్ కేర్ బ్రాండ్‌ను స్థాపించింది. 'భూమిత్ర' పేరుతో ప్రారంభించిన ఈ కంపెనీ ప్రకృతి ప్రసిద్ధమైన ఔషధాలతో తయారుచేసిన సౌందర్య ఉత్పత్తులను అందిస్తున్నది.



### గోల్డెన్ థ్రెషోల్డ్.. తమన్నా

**మిలమిల** మెరిసే పాలపుంతలాంటి అందం తమన్నా సొంతం. ధగధగ మెరిసే ఆభరణాలంటే ఈ అమ్మడికి ఎంతో ఇష్టం. అందుకే కాబోలు బంగారు ఆభరణాల వ్యాపారాన్ని ఎంచుకుందీ మిల్కీ బ్యూటీ. సినీ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన అనతి కాలంలోనే పెద్ద హీరోల సరసన నటించే చాన్స్ కొట్టేసింది. స్టార్ హీరోయిన్‌గా దశాబ్దానికి పైగా వెలుగు వెలిగింది. ఇప్పటికీ రెగ్యులర్‌గా సినిమాలు చేస్తున్నది. సినిమాల్లో కాల్షీట్లు సర్దుబాటు చేయనంత బిజీగా ఉన్నప్పుడే 2015లో 'వైట్ అండ్ గోల్డ్' పేరుతో బంగారు ఆభరణాల వ్యాపారాన్ని ప్రారంభించింది. ఈ ఆన్‌లైన్ బిజినెస్ మూడు డైమండ్లు.. ఆరు నెక్లెస్‌లుగా కొనసాగుతున్నది.



### మెగా పార్ట్‌నర్ అత్తమ్మాస్ కిచెన్

**అట్టు** వేయడంలో మెగాస్టార్ చిరంజీవి రూటే సెపరేటు. ఆయన జీవితాన్ని పంచుకున్న సురేఖ ఇప్పుడు తన టాలెంట్ నిరూపించుకోవడానికి సిద్ధమైంది. తన పుట్టిన రోజు సందర్భంగా ఈ నెల 18న 'అత్తమ్మాస్ కిచెన్' పేరుతో ఆన్‌లైన్ వ్యాపారానికి శ్రీకారం చుట్టింది. మెగా కోడలు రామ్‌చరణ్ భార్య ఉపాసన ఈ వ్యాపారంలో కీలక భూమిక పోషిస్తున్నది. 'అత్తమ్మాస్ కిచెన్' నుంచి సౌత్ ఇండియా స్పెషల్ వెరైటీలను రెడీమిక్స్ రూపంలో అందించనున్నారు. ఇంటి వంట రుచిని అందించేలా వీటిని ఉత్పత్తి చేస్తున్నామని చెబుతున్నది ఉపాసన. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుంటే మెగా కాంపౌండ్ నుంచి మనకు కావాల్సిన రుచులు పొందొచ్చన్నమాట. ఇప్పటికైతే ఉప్మా, పులిహోర, రసం, పొంగల్ వంటి ఉత్పత్తులు విక్రయిస్తున్నారు. ఈ నాలుగు ప్యాకెట్ల ధర రూ.1099గా నిర్ణయించారు.






## నాది సక్సెస్‌ఫుల్ జర్నీ..

కర్ణాటకలోని మంగళూరు తీరం మనోహరంగా ఉంటుంది. అక్కడి అరబిక్ కడలి అందాన్ని మించిన సొగసరి నటీమణులకు మంగళూరు కేరాఫ్. 'డీజే టిల్లూ'తో తెలుగువారిని ఉర్రూతలూగించిన నటి నేహా శెట్టిదీ ఆ ఊరే! కన్నడ తీరంలో మొదలైన ఈ అందాల తుఫాను ఇప్పుడు టాలీవుడ్‌పై కేంద్రీకృతమైంది. వరుస అవకాశాలతో ఎడతెరిపి లేకుండా విజయాలు సాధిస్తున్నది. త్వరలోనే 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' సినిమాతో అభిమానులను అలరించడానికి సిద్ధమవుతున్న నేహా పంచుకున్న కబుర్లు ఆమె మాటల్లోనే..

**చిన్నప్పటి** నుంచి సినిమాల్లో నటించాలన్న ఆసక్తి ఉండేది. కానీ సినిమా ఇండస్ట్రీకీ, మా కుటుంబానికీ సంబంధమే లేదు. మా అమ్మ డెంటిస్ట్. నాన్న బిజినెస్‌మ్యాన్. స్కూల్ డేస్‌లో డ్యాన్స్ అంటే ఆసక్తి ఉండేది. స్కూల్ డ్రామాల్లో తప్పకుండా పాల్గొనేదాన్ని. తరచూ సినిమాలు చూసేదాన్ని. హీరోయిన్లు వేసుకున్నట్టుగా దుస్తులు ధరించేదాన్ని. సినిమాలో హీరోయిన్లు వేసిన డ్రెస్ మళ్లీ వేసుకోరు కదా.. నేనూ అలాగే ఒకసారి ధరించిన డ్రెస్ మళ్లీ వేసుకోనని మారాం చేసేదాన్ని. ఇలా సినిమాల ప్రభావం నామీద చాలానే ఉంది.

**మాది** మంగళూరు. మోడల్, యాక్టర్ కావాలన్న లక్ష్యంతోనే బెంగళూరుకు వచ్చాను. డ్యాన్స్ క్లాసులకు వెళ్తుండేదాన్ని. చిన్నప్పుడే హార్లిక్స్ ప్రకటనలో నటించే అవకాశం వచ్చింది. షూటింగ్ భలేగా అనిపించింది. నేను నటించిన యాడ్ టీవీలో వస్తుంటే థ్రిల్ అయ్యేదాన్ని. కాలేజ్ ఏజ్‌కు వచ్చాక మోడలింగ్‌లో శిక్షణ తీసుకున్నా. అప్పుడు కూడా సినిమా అవకాశాలు ఎలా వస్తాయన్న విషయం నాకు అర్థమయ్యేది కాదు! కానీ, చాన్స్ వచ్చినప్పుడు సిద్ధంగా ఉండాలనే తపన మాత్రం బలంగా ఉండేది.

**ఐశ్వర్యరాయ్,** శిల్పాశెట్టి, దీపిక.. వీళ్లంతా మోడలింగ్ నుంచే సినిమాల్లోకి వచ్చారు! అందుకే, సినిమాల్లోకి ఎంట్రీ ఇవ్వడానికి మోడలింగ్ ఒక్కటే దారి అనిపించింది. మోడలింగ్‌లో ఉన్నప్పుడే మిస్ మంగళూరు, మిస్ సౌత్ ఇండియా కాంటెస్ట్‌లో పాల్గొన్నాను. ఆ ప్రయత్నాలే కన్నడ చిత్రం 'ముంగారు మళె 2'లో అవకాశం వచ్చేలా చేశాయి. అలా నటిని కావాలన్న నా కల నెరవేరింది. మొదటి సినిమా పూర్తయ్యాక తెలుగులో అవకాశాలు వచ్చాయి. 'డీజే టిల్లూ'తో నా జర్నీ సక్సెస్‌ఫుల్‌గా ప్రారంభమైంది.

**'డీజే టిల్లూ'లో** నాది చాలెంజింగ్ రోల్. అందులో 'రాధిక' పాత్ర నాకే కాదు, ప్రేక్షకులకూ ఎప్పటికీ గుర్తుండిపోతుంది. నేను బయట కనిపిస్తే అదే పేరుతో పిలుస్తుంటారు. ఆ పాత్ర ప్రేక్షకులకు అంత దగ్గరైంది. ఆ తర్వాత వచ్చిన 'మెహబూబా', 'గల్లీరౌడీ', 'రూల్స్ రంజన్', 'బెదురులంక' సినిమాల్లోనూ మంచి పాత్రలు వచ్చాయి. మంచి స్క్రిప్టులు వస్తున్నాయి. విడుదలకు సిద్ధంగా ఉన్న 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' సినిమాలో డిఫరెంట్ రోల్‌లో కనిపిస్తాను.

**మాధురీ** దీక్షిత్, శ్రీదేవి, సౌందర్య నా అభిమాన నటులు. చిన్నప్పుడు వారిని చూస్తూ పెరిగాను. ఎలాంటి పాత్రనైనా మెప్పించగల నటనా సామర్థ్యం వారిది. మాధురి డ్యాన్సంటే కన్నార్పకుండా చూస్తాను. యాక్టింగ్‌లో వాళ్లే నాకు ఆదర్శం. నేను ఆరాధించే నటీమణుల్లా సుదీర్ఘ కాలం ప్రేక్షకులను అలరించాలని ఆశిస్తున్నాను.


**ఇండస్ట్రీలో** చాలామంది స్నేహితులు ఉన్నారు. అడపాదడపా పార్టీలు గట్రా జరుగుతాయి. నా వ్యక్తిగత విషయాలను మాత్రం చిన్ననాటి మంగళూరు స్నేహితులతోనే పంచుకుంటాను. వారిలో చాలామంది ఇప్పటికీ నాతో టచ్‌లో ఉంటారు.

**ఫ్యాషన్** ట్రెండ్స్ గురించి పెద్దగా అవగాహన ఉండదు. నాకు కంఫర్ట్‌గా ఉండే దుస్తులు ధరించడానికి ఇష్టపడతాను. కుర్తీ, డెనిమ్ నా ఫస్ట్ చాయిస్. షార్ట్స్, టాప్ కూడా రెగ్యులర్‌గా ధరిస్తుంటాను. ఆ రోజు నా మూడ్‌ను బట్టి డ్రెస్ సెలెక్షన్ ఉంటుంది. అంతేకానీ, ప్రీప్లాన్డ్‌గా ఏదీ ఉండదు.



### ఫిట్‌నెస్ కింగ్.. రకుల్ ప్రీత్ సింగ్

**కొత్త** పెండ్లికూతురు రకుల్ ప్రీత్ సింగ్ పేరు చెప్పగానే ఆమె అభిమానులకు ఫిట్‌నెస్ గుర్తుకొస్తుంది. ఔను! ఫిట్‌నెస్ విషయంలో కచ్చితంగా ఉండే ఈ సుందరి తనకు ఇష్టమైన ఫీల్డ్‌నే బిజినెస్‌కు ఎంచుకుంది. 'ఎఫ్45' పేరుతో ఫిట్‌నెస్ హెల్త్ హబ్, జిమ్ ప్రారంభించింది. 'ఎఫ్45' ఆస్ట్రేలియాకు చెందిన సంస్థ. ఈ ఫ్రాంచైజీని కొనుగోలు చేసిన రకుల్ మూడు శాఖలను నిర్వహిస్తున్నది. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి, కోకాపేటతోపాటు విశాఖలో 'ఎఫ్45' కేంద్రాలున్నాయి. ఈ బిజినెస్‌లో రకుల్ సోదరుడు అమన్ కూడా భాగస్వామి.



### హోమ్ డెకర్ లేబుల్..కాజల్

**టాలీవుడ్** 'చందమామ' కాజల్ అగర్వాల్ తన సోదరి నిషా అగర్వాల్‌తో కలిసి 'మర్సాలా' అనే జువెలరీ బ్రాండ్‌ను స్థాపించింది. భర్త గౌతమ్ కిచ్లూ సహకారంతో 'కిచడ్' పేరుతో ఓ హోమ్ డెకర్ లేబుల్ నిర్వహిస్తున్నది. ఇక్కడ సోఫాలు, కుషన్‌లు విక్రయిస్తారు.



### హవా ఉన్నప్పుడే..

**గాలి** ఉన్నప్పుడే వడ్లు తూర్పారబట్టాలి అని సామెత. ఈ మాటలనే ఫాలో అవుతున్నారు పలువురు హీరోయిన్లు. కర్లీ హేర్ పాప తాప్సీ తన చెల్లెలు శగున్, స్నేహితురాలు ఫరా పర్వేషన్‌తో కలిసి ఈవెంట్ మేనేజ్‌మెంట్ వ్యాపారాన్ని ప్రారంభించింది. 'ద వెడ్డింగ్ ఫ్యాక్టరీ' పేరుతో స్థాపించిన ఈ వేదిక ద్వారా ఒక్కటైన సెలెబ్రిటీలు చాలామందే ఉన్నారు. ఇలియానా గోవాలో రెస్టారెంట్లు, బేకరీలు నడుపుతున్నది. ప్రణీతకు బెంగళూరులో రెస్టారెంట్ ఉంది. శ్రియా శరణ్ 'శ్రీ స్పందన' పేరుతో బ్యూటీ సెలూన్, స్పా నిర్వహిస్తున్నది.

... ఆరుట్ల నరేశ్